క్లుప్తంగా

రైతు బీమాతో ధీమా



భీమ్‌గల్ : పురాణిపేట్ గ్రామానికి చెందిన తోట లక్ష్మి కొద్ది రోజుల కిందట గుండె పోటుతో మరణించింది. ఆమె భర్త తోట శంకర్‌కు రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని ఆదివారం బీఆర్‌ఎస్ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్‌లు, సర్పంచ్ తోట శంకర్, ఎంపీటీసీ సాయి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అనాథల కోసం ఆశ్రమం



నందిపేట్(ఆర్మూర్): జోర్‌పూర్ శివారు ప్రాంతంలో ఆదివారం ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథల కోసం ఆశ్రమం ఏర్పాటు నిమిత్తం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మచ్చర్ల వినయ్ మాట్లాడుతూ.. అనాథలు, పేద పిల్లలు, వృద్ధుల కోసం ఆశ్రమ నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. జోర్పూర్ రాము, సర్పంచు బాబారావు, నందిపేట ఉప సర్పంచు భరత్, మచ్చర్ల చిన్నసాయన్న, జోర్‌పూర్ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచ శతక ధారణ సభ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పంచ శతక ధారణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బెజుగామ రామమూర్తి రచించిన మధుర సూక్తులు శతకం, తల్లావజ్జల మహేష్ బాబు రచించిన పొడుపు విడుపు, పబ్బ మురళి రచించిన మురళి శతకం, కాసర్ల నరేశ్ రావు రచించిన వానచుక్క శతకం, గంట్యాల ప్రసాద్ రచించిన ఓటరన్న శతకములను ధారణ చేశారు. పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఐదు నీతి శతకాలలోని 540 పద్యాలను వరుస క్రమంలో కంఠత రాగయుక్తంగా పాడి అబ్బుర పరిచారు. పంచ శతక ధారణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పబ్బ మురళి శతక పఠనాన్ని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఓరియంటెడ్‌గా ఉండాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మలుపు అయిన ఇంటర్మీడియట్ విద్య తర్వాత ఎంచుకునే కోర్సులు కెరీర్ ఓరియంటెడ్‌గా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ రాచకొండ చంద్రశేఖర్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ, అల్జాపూర్ రాజేశ్వర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్య– దిశ నిర్దేశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ వ్యాఖ్యాత వంగ శ్రీహరి మాట్లాడుతూ.. కెరీర్‌లో ఎలా సఫలీకృతం కావాలో వివరించారు. సొసైటీ చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపల్ బండారి నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ఆర్మూర్ టౌన్: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి రాయాలని ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు అన్నారు. పట్టణంలోని శ్రీ గాయత్రి కళాశాలలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు పాల్గొని పరీక్ష పత్రాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ప్రముఖ విద్యావేత్త ఐఐటీ చుక్కారామయ్య ఆధ్వర్యంలో ఈ పరీక్ష పత్రాలను తయారు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రతిభ పరీక్షల్లో రాసి తమ సత్తాను నిరూపించుకోవాలని కోరారు. టాలెంట్ పరీక్షల్లో మొత్తం 370 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గాయత్రి కళాశాల కరస్పాండెంట్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతే గానీ పట్టించుకోరా..?

- ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు



బోగీలోకి ఎక్కి కొందరు బోగి కింద నుంచి మరికొందరు పట్టాలు దాటుతున్న దృశ్యం



డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న ప్రజలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌కు అటువైపు ఘన్‌పూర్ గ్రామం ఉంది. అక్కడే తహసీల్దార్, మండల పరిషత్, మండల వ్యవసాయశాఖ కార్యాలయాలు, ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రి(సీహెచ్‌సీ), ప్రభుత్వ ఆయుర్వేద, యునానీ ఆస్పత్రులు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఎంఈవో కార్యాలయం, మండల సమాఖ్య, ఉపాధి హామీ, పోస్టాఫీసు కార్యాలయాలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాల, పాఠశాలలకు నిత్యం పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వివిధ గ్రామాల ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్నారు. బ్రాడ్‌గేజ్‌గా మారిన తర్వాత డిచ్‌పల్లి మీదుగా నిత్యం సుమారు 46 వరకు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి అరగంటకు ఒకటి చొప్పున ఏదో ఒక రైలు డిచ్‌పల్లి మీదుగా వెళ్తోంది. కొన్ని సార్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ ఖాళీ లేకపోతే డిచ్‌పల్లిలోనే రైళ్లను నిలిపివేస్తుంటారు. అలాగే ఇటీవలే డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో సరుకు రవాణా కోసం గూడ్స్ షెడ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడూ ఏదో ఒక రైలు స్టేషన్‌లో నిలిచి ఉండే పరిస్థితి నెలకొంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది నిలిచి ఉన్న రైలు బోగీల్లోకి ఎక్కి కొందరు, బోగి కింద నుంచి ప్రమాదకరంగా మరికొందరు దాటి వెళ్తున్నారు. ఇటీవలే ఒక మహిళ రైలు బోగి కింద నుంచి దాటే సమయంలోనే రైలు కదలడంతో ఆమె కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అదృష్టవశాత్తు కొద్దిలో ప్రాణాలు పోకుండా బతికి బయటపడిందని స్థానికులు తెలిపారు. 30 ఏళ్లుగా డిచ్‌పల్లిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ఎవరైనా ప్రాణాలు పోగొట్టుకుంటేనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిస్తారా.. అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

కేసీఆర్‌కు త్వరలోనే బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ..



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తూ..

- బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: అమరవీరుల కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని, త్వరలోనే కేసీఆర్‌కు బుద్ధి చెబుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని 37వ డివిజన్‌లో ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1200 మంది ఆత్మ బలిదానంతో సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా చేశారని మండిపడ్డారు. ఇప్పటి వరకు అమరవీరుల కుటుంబాలను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు శివప్రసాద్, మండల అధ్యక్షుడు గడ్డం రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల లక్ష్మీనారాయణ, సుదర్శన్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

కలెక్టర్‌ను కలిసిన ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, బీజేపీ కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, ఇల్లెందుల ప్రభాకర్, జిల్లా నాయకులు బట్టికారి ఆనంద్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు ఉపాధి కల్పించాలని వినతి



ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతిపత్రం అందిస్తున్న గంగపుత్రులు

మోపాల్: సింగంపల్లి గ్రామంలోని రామన్ చెరువు(దయ్యాలకుంట) చేపలు వదిలి గంగపుత్రులకు ఉపాధి కల్పించాలని సింగంపల్లి గంగపుత్రులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ని కోరారు. ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న చెరువు పూడికతో నిండిపోయిందని ఈ పూడికను తొలగించి చెరువు శుభ్రం చేయటంతో పాటు ప్రభుత్వ పథకంలో భాగంగా చేప పిల్లలను వదలాలని కోరారు. చేపలను అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం కల్పించడంతోపాటు గ్రామంలో గంగపుత్రుల సంఘం కమ్యూనిటీ భవనం నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంపీపీ లతా కన్నీరం, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు

మల్లారంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారంలో పలు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధులు మంజూరు చేశారు. ఆదివారం ఈ మేరకు తన నివాసంలో మల్లారంలో దాసరి సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు, మున్నూర్ కాపు కమ్యూనిటీ సంఘానికి రూ.5 లక్షలు, క్రిస్టియన్ చర్చి నిర్మాణానికి రూ.5 లక్షలు..సంబంధిత ప్రొసీడింగ్ కాపీలను, ఎస్‌డీఎఫ్ ప్రొసీడింగ్ పత్రాలను గ్రామ కమిటీ సభ్యులకు, స్థానిక సర్పంచ్‌లకు అందజేశారు. మండల వైస్ ఎంపీపీ అన్నంసాయిలు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు పాల్గొన్నారు.

శరవేగంగా డివైడర్ల నిర్మాణం



ముబారక్‌నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న డివైడర్లు

- ముబారక్‌నగర్ నుంచి సుజిత్ ఫ్యాక్టరీ వరకు..
- రూ. కోటి 10 లక్షల వ్యయం.. 1.4 కిలోమీటర్ల దూరం



నిజామాబాద్‌నాగారం: నగరంలో ప్రధాన రహదారుల్లో డివైడర్ల నిర్మాణం శరవేగంగా చేపడుతున్నారు. ఇప్పటికే బస్టాండ్ మీదుగా గాంధీచౌక్ వరకు, పూలాంగ్ నుంచి ఖిల్లా చౌరస్తా వరకు, పూలాంగ్ నుంచి హైదరాబాద్ రోడ్ వరకు, కంఠేశ్వర్ బైపాస్ మీదుగా గంగాస్థాన్ వరకు నిర్మాణం పూర్తి చేశారు. తాజాగా ముబారక్‌నగ్‌నగర్‌లోని లక్ష్మీప్రియనగర్ చౌరస్తా నుంచి సుజిత్ ఫ్యాక్టరీ వరకు డివైడర్ల నిర్మాణం జరుగుతోంది. రూ. కోటి 10 లక్షలతో 1.4 కిలో మీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో నుంచి వాహనాలు, పాదచారులు వెళ్లకుండా ప్రత్యేక చౌరస్తా నుంచే వెళ్లేలా నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు బాగు చేసి డివైడర్ల నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంది. డివైడర్ల నిర్మాణంలో కచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగరవాసులు కోరుతున్నారు. పదికాలల పాటు గట్టిగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు డివైడర్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

పర్యవేక్షిస్తున్నాం

నగరంలో డివైడర్ల నిర్మాణం పక్కాగా జరిగేలా చూస్తున్నాం. కాంట్రాక్టర్ పనులపై మా ఏఈ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించాను. నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే. డివైడర్లతో రోడ్లు కూడా అందంగా మారుతాయి. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంటుంది.

– రమేశ్, ఆర్‌అండ్‌బీ, ఈఈ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సిరికొండ: మండలంలోని తూంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ మాన్‌సింగ్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. సర్పంచ్ బాలామణి, ఎంపీటీసీ లింగం, నాయకులు మహేందర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నిజామాబాద్ సిటీ/ఖలీల్‌వాడి: జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడిగా మాణిక్‌రాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా భట్రాజు సంఘంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా సంఘం కార్యదర్శిగా రామరాజ్, నగర కార్యదర్శిగా బాపురాజ్, కోశాధికారులుగా శ్రీనివాస్ రాజ్, మారుతి రాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్రీరామ్ రాజు, ఎన్నికల పరిశీలకులుగా లింగం రాజ్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గం సభ్యులు మూడు సంవత్సరాల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు.

సమాన హక్కుల కోసం పోరాడాలి

బోధన్: సమాన హక్కులు, అవకాశాల కోసం మహిళలు సంఘటితంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పుట్ట లక్ష్మి పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధిని ఉద్దేశపూర్వకంగానే దెబ్బతీస్తూ స్త్రీ, పురుష అసమానత్వాన్ని పెంచి పోషించే పితృస్వామిక పాలనను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఆదివారం బోధన్ పట్టణ కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్లను సంఘ ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు.

గంజాయి సూత్రధారులను పట్టుకోండి



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి విక్రయాల వెనకు ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవాలని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం కోసం గంజాయి కేసులను ఎరగా వాడుతున్నారని ఆరోపించారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో సునీల్‌రెడ్డి మాట్లాడారు. ముప్కాల్‌లో ఇద్దరు అధికార పార్టీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక నాయకుడి పిల్లలపై గంజాయి కేసును నమోదు చేయడం తన ఆరోపణలకు నిదర్శనం అన్నారు. గంజాయిపై తాను మూడేళ్లుగా పోరాటం చేస్తున్నానని అయినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం బాల్కొండ నియోజకవర్గంలో శాంతికి విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ పట్టణ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 70వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్, పలువురు చిరువ్యాపారులు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, అర్జున్‌రాందార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీతికి కొవ్వొత్తులతో నివాళులు



నగరంలోని గిరిజన హాస్టల్లో నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గిరిజన హాస్టల్లో మెడికల్ విద్యార్థిని ప్రీతికి ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ప్రీతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశాడు. లేదంటే భారీ ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

ఆధ్యాత్మికం

మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు



మోపాల్: కంజర్‌లో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు అలరించాయి. ఫిబ్రవరి 3, 4, 5 తేదీల్లో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడి ప్రవీణ్ రెడ్డి, అంగల్ సాయిరెడ్డి, శంకర్, మోహన్ రెడ్డి, చిన్నారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో రథోత్సవం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం అశోక్‌ఫారంలో వైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో సంక్షేప రామాయణం నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామి వారిని అర్చకులు, భక్తులు రథంలో ఊరేగించారు. అనంతరం ఆలయ కమిటీ, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అర్జున్‌రావు, వైస్ చైర్మన్ సంజీవ్‌రావు పాల్గొన్నారు.

వర్నిలో గర్భిణులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో భాగంగా ఆర్యజనని బుక్స్ ప్రదర్శిస్తున్న మహిళలు

- రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గదర్శనం

రుద్రూర్: వర్ని మండల కేంద్రంలోని మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్‌లో ఆదివారం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో గర్భిణులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఓ మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చే వరకు పాటించవలసిన సూచనలను డాక్టర్ అంజలి వివరించారు. ప్రసవానికి ముందు యోగా, గాఢమైన విశ్రాంతి, శ్వాసించడం, ధ్యానానికి సంబంధించిన శక్తిమంతమైన చిట్కాలను తెలియజేశారు. కార్యక్రమంలో యోగ నిపుణులు దీప్తి, సామాజిక కార్యకర్తలు నారాయణ రావ్, మాధురి పాల్గొన్నారు. వర్క్ షాప్‌నకు కోటగిరి, వర్ని మండలాల నుంచి గర్భిణులను వాహనాల్లో తరలించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	56,950	వెండి (కిలో)	68,500
22 క్యారెట్స్	52,493	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	క్యాప్సికం	35	50
బెండకాయ	40	60	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	20	40
దొండకాయ	20	30	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	35	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	10	20	గోబిపువ్వు	15	30
పాలకూర	10	20	బీట్‌రూట్	15	30
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	30	50
పుదీనా	30	50			– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పెవిలియన్)

స్క్రీన్–1– సార్– 1.30,7.30; వినరో భాగ్యము విష్ణుకథ –4.30
స్క్రీన్–2– వినరో భాగ్యము విష్ణుకథ–1.40, 7.40,10.30
స్క్రీన్–3– కొనసీమ –1.40,7.40; యాంటి–మేన్ అండ్ ది వాస్(ఇంగ్లీష్) –10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– సెల్ఫీ–(హిందీ)–10.40,4.40,10.40; యాంటి–మేన్ అండ్ ది వాస్(ఇంగ్లీష్) –1.50, 7.50,10.30
స్క్రీన్–2 – సెల్ఫీ –(హిందీ)–12.00; సార్ – 3.15, 10.00; పఠాన్–హిందీ–6.30
స్క్రీన్–3– సెల్ఫీ–హిందీ–1.10,7.20; కొనసీమ–4.20,10.30
స్క్రీన్–4– వినరో భాగ్యము విష్ణు కథ –12.40, 4.00, 7.00; పఠాన్ –హిందీ–10.20

దేవి – సార్
నటరాజ్ – యాంట్–మేన్ అండ్ ది వాస్ప్
లలితామహల్ – వాల్తేరు వీరయ్య
శ్రీదేవి – కింగ్
విజయ్ – వినరో భాగ్యము విష్ణు కథ